క్లుప్తంగా

కరాటేతో ఆత్మరక్షణ



విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణను పొందాలని సీపీఎం నాయకులు విజయరామాంజనేయులు, వైద్యుడు గోపినాథ్ రెడ్డి సూచించారు. ఆదివారం కర్నూలులోని జొహరాపురం భవిత ఇంగ్లిష్ మీడియం స్కూలులో సుందరయ్య కరాటే కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కరెస్పాండెంట్ బీకే నరేంద్ర, యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కామ్రేడ్ రవన్నకు నివాళి



రవన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలుగు రాష్ట్ర కార్యదర్శి రవన్న ఆశయ సాధన కోసం పోరాడతామని ఆ పార్టీ నగర కార్యదర్శి వెంకటస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని గోకారి, నీలం రామచంద్రయ్య కాలనీలో రాయల సుభాష్‌చంద్రబోస్ (రవన్న) 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రమణ, రాజు, బ్రహ్మయ్య, నాగేంద్ర, చిన్నబాబు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం.. పరమ పావనం



జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులకు హారతి ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ప్రతిఒక్కరూ భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలని దీంతో పరమ పావనం చెందుతామని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు దాస్ అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం భగవద్గీతపై ప్రవచనం చెప్పారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉత్తమ జీవితానికి భగవద్గీత మార్గదర్శనం అన్నారు. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. జగన్నాథ్‌కు మహారాజభోగ నివేదన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు చట్ట సభల్లో సీట్లు కేటాయించాలి

కర్నూలు(అగ్రికల్చర్): చట్ట సభల్లో బ్రాహ్మణ జాతికి స్థానం కల్పించే దిశగా అన్ని రాజకీయ పార్టీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్) అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు కోరారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో నాలుగు శాతం బ్రాహ్మణ జనాభా ఉందని, ఈ దామాషా ప్రకారం శాసన సభ, శాసన మండలిలో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు చట్టసభల్లో బ్రాహ్మణ జాతికి తగ్గిన స్థాయిలో సీట్లు లేవని, రాజకీయ పార్టీలు కూడా బ్రాహ్మణులను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. బ్రాహ్మణ జనాభాకు అనుగుణంగా సీట్లు కేటాయించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. బ్రాహ్మణుల్లో కూడా పేదలు ఉన్నారని, వారి సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : ఛావా,కింగ్‌స్టన్,సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు,రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ శబ్దం,రాక్షస,మజాకా ,శివంగి లయనెస్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : కింగ్‌స్టన్, తండేల్, శబ్దం,రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ మజాకా,జిగేల్,రాక్షస
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ఛావా, నారీ సంక్రాంతికి వస్తున్నాం
శ్రీరామ : ఛావా
రాజ్ : సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు
భరత్ కాంప్లెక్స్ : తండేల్, రా రాజా నీరుకుళ్ల 35 కేఎం
విజయ థియేటర్ : మజాకా
విక్టరీ టాకీస్ : సంక్రాంతికి వస్తున్నాం

రక్షణకు 'తల'మాణికం

- హెల్మెట్ వాడకంపై జిల్లా అంతటా ప్రత్యేక డ్రైవ్
- స్టేషన్ల వారీగా పోలీసుల అవగాహన కార్యక్రమాలు
- నిబంధనలు కట్టుదిట్టం చేస్తూ ముమ్మర తనిఖీలు



హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ధారణపై పోలీసు శాఖ దృష్టి సారించింది. హెల్మెట్ ధారణ అంశాన్ని పోలీసు, రవాణా శాఖ అధికారులు ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదని ఇటీవల హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. తక్షణ చర్యలపై నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా పోలీసు శాఖ రంగంలోకి దిగింది. హెల్మెట్ ధారణను తప్పనిసరి చేసేలా చర్యలు చేపట్టారు. జరిమానాలకే పరిమితం కాకుండా ముందుగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో నాలుగు పోలీస్ సబ్‌డివిజన్లు, 39 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ప్రతి స్టేషన్ పరిధిలో రెండు వారాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి రహదారులపై రాకపోకలు సాగించడం మొదలయ్యింది. కర్నూలు నగరంలో 'నో హెల్మెట్... నో ఎంట్రీ' నిబంధనతో తనిఖీలు చేస్తూ వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

తలకు పెట్టుకుంటే ప్రాణం దక్కినట్లే

ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. ప్రమాదం జరిగినప్పుడు అది ఊగి కింద పడిపోకుండా బెల్టు పెట్టుకోవాలి. రహదారి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించే ఐఎస్ఐ హెల్మెట్ వాడకమే ఉత్తమం. వాహనంపై వెళ్తున్నప్పుడు దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదం జరిగితే తలకు తీవ్రమైన గాయం కాకుండా హెల్మెట్ కాపాడుతుంది. మెదడు దెబ్బతిని ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నుంచి తప్పించుకోవచ్చు. హెల్మెట్ ధరించడం వల్ల బతికే అవకాశాలు 42 శాతం, గాయాల నుంచి రక్షణ 69 శాతం లభిస్తుందని పోలీసులు అంటున్నారు. ప్రమాద సమయంలో హెల్మెట్ ఉన్న తల నేలకు తాకినప్పటికీ తీవ్ర గాయం నుంచి బయటపడవచ్చు. ఒకవేళ ప్రమాదంలో తలకు గాయమైనప్పటికీ మెదడుపై ఆ ప్రభావం పడనీయదు. తల, మెదడుతో పాటు ముక్కు, నోరు, చెవులకు ఎటువంటి గాయాలు కాకుండా రక్షణ కవచంగా ఉంటుందని పోలీసు, రవాణా శాఖ అధికారులు కౌన్సెలింగ్‌లో చెబుతున్నారు.

గీత దాటితే మోతే...

మోటర్ వాహనాల చట్టం, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించే వాహనదారులపై పోలీసులు కొరఢా ఝుళిపిస్తున్నారు. నిబంధనలు పాటించకుండా రయ్.. మంటూ దూసుకెళ్తున్న వారిని ట్రాఫిక్ పోలీసులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ జరిమానాలు విధిస్తున్నారు. వాహనదారుల భద్రత కోసం నేరుగా తనిఖీలు చేపట్టి హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, అతి వేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ధృవపత్రాలు లేని వాహనదారులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు.

హెల్మెట్ లేకే మరణాలు



రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్లే సంభవిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాల్సిందే. జరుగుతున్న ప్రమాదాల్లో 60 శాతం మంది హెల్మెట్ లేక తలకు బలమైన గాయాలు కావడం వల్లే మరణించారని తేలింది. హెల్మెట్ ధారణపై ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రజల్లో మార్పు తెచ్చేందుకు జిల్లావ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయి.

– మన్సూరుద్దీన్, ట్రాఫిక్ సీఐ

పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రానివ్వొద్దు

కర్నూలు (టౌన్): పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు రాకుండా కార్మికులు పనిచేయాలని, అదే స్థాయిలో సచివాలయాల సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ చేయాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. ఆదివారం కమిషనర్ ధర్మపేట, స్టేడియం రహదారి, రాజ్‌విహార్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చేంత వరకు వేచిఉండకుండా ఎప్పటికప్పుడు చెత్త చెదారం తొలగించాలన్నారు. రెండు వారాలకు ఒకసారి తప్పనిసరిగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. కాలనీలలో ప్రతి ఇంటి వద్ద మురుగు కాల్వలను శుభ్రం చేయాలన్నారు. అపరిశుభ్రత కనిపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీటీ నాయుడు

కర్నూలు(అగ్రికల్చర్): ఆదోని నియోజకవర్గానికి చెందిన బీటీ నాయుడును ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటిస్తూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన బీటీ నాయుడు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల టీడీపీ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

క్రీడాభివృద్ధికి సహకారం



స్పోర్ట్స్ కిట్లు, క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న శమంతకమణి

కర్నూలు (టౌన్): క్రీడలకు, క్రీడాకారులకు తన వంతుగా సహకారం అందిస్తానని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ పార్కులో తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో తైక్వాండో క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల వైపు పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందిస్తున్నానన్నారు. క్రీడాకారులు మంచి సాధన చేసి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు. తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కర్నూలు నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో ఒలింపిక్ సంఘం గుర్తించిన తైక్వాండో క్రీడాంశంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ క్రీడల్లో రాణించే వారికి సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. అనంతరం ప్రతిభ చాటిన క్రీడాకారులకు కలర్ బెల్టులు పంపిణీ చేశారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, క్రీడా దుస్తులను అందజేశారు.

ఫీజు బకాయిలపై పోరుబాట

కర్నూలు (టౌన్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు దాటింది. యువజన, నిరుద్యోగ, విద్యార్థినీ, విద్యార్థుల సమస్యలు పరిష్కారిస్తుందని ఆశించాం. ఇక నమ్మకం లేక పోరుబాట ఎంచుకున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం యువజన విభాగం జెండాలను అధ్యక్షులచే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సర్కారు విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందన్నారు. ఉన్నత వర్గాలకు, కార్పొరేట్‌లకు కొమ్ము కాస్తోందన్నారు. పేద, బడుగు, బలహీన, మధ్య తరగతి, ఉన్నత వర్గాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వారు సైతం ఉన్నత చదువులు చదవాలని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేశారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. రూ.3 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో ఈ నెల 12న చేపట్టనున్న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే పలు విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేశాయన్నారు. కర్నూలు నగరంలో కలెక్టరేట్ వరకు చేపట్టనున్న ర్యాలీలో యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యువజన విభాగం నాయకులు దుర్గా, బాలు, అశోక్ రెడ్డి, వెంకటేష్, అశోక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 5న బళ్లారి చౌరస్తా నుంచి కోడుమూరు వెళ్లే రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న కాటిపోగు శేఖర్ (37) కోలుకోలేక ఆదివారం మరణించారు. నంద్యాల జిల్లా, మిడుతూరు మండలం, ఆలగనూరు గ్రామానికి చెందిన కాటిపోగు శేఖర్ స్కూటీపై అత్తగారి గ్రామమైన పెద్దపాడు వెలుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. క్షతగాత్రుడిని 4వ పట్టణ పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

చిరస్మరణీయులు ఎంపీఎం రెడ్డి, వియోగి



ఎంపీఎం రెడ్డి, వియోగి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: సాహితీ చరిత్రలో చిరస్మరణీయులు సముద్ర శాస్త్రవేత్త ఎంపీఎం రెడ్డి, వియోగి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం ప్రాంతీయ కార్యాలయంలో ఎంపీఎం రెడ్డి, వియోగి సంతాప సభ నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కెంగార మోహన్, జంధ్యాల రఘు బాబు మాట్లాడుతూ.. నిస్వార్థంతో రచనలు, పరిశోధనలు చేసి కొత్త అంశాలను వెలుగులోకి తెచ్చిన గొప్ప వ్యక్తులు ఎంపీఎం రెడ్డి, వియోగి అన్నారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు అవుల చక్రపాణి యాదవ్, మారుతీ, నాగమణి మాట్లాడారు. సభ్యులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

కేఎంసీలో వైద్య విజ్ఞాన సదస్సు



ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వెంకటేశ్వర్లుతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ఆదివారం మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో జోనల్ స్థాయి వైద్య విజ్ఞాన సదస్సు (సీఎంఈ) నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మైక్రోబయాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రేణుకదేవి ఆధ్వర్యంలో హ్యూమన్ మైక్రోబయోమ్ అనే అంశంపై పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థుల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమం జరిగింది. మైక్రోబయోమ్‌పై డాక్టర్ రేణుకాదేవితో పాటు డాక్టర్ కె. శివప్రసాద్, డాక్టర్ కుముద, డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ చక్రపాణి ప్రసంగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, కో ఆర్డినేటర్ డాక్టర్ సాయి సుధీర్, జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి, అబ్జర్వర్ డాక్టర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

కబడ్డీ విజేత ఎన్.కొంతలపాడు

ఓర్వకల్లు: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. గ్రామంలోని అంబాసహిత, యాగంటీశ్వర స్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో వివిధ రాష్ట్రాలకు చెందిన 40 జట్లు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ పోటీలలో ఎన్.కొంతలపాడు జట్టు విజేతగా నిలిచి రూ.25 వేలను గెలుచుకుంది. తరువాతి స్థానాల్లో నిలిచిన ఎమ్మిగనూరు తాలుకా, గోనెగండ్ల జట్టు రూ.20 వేలు, తెలంగాణ రాష్ట్రం, పచ్చర్ల జట్టు రూ.15 వేలు, వారణాసి (కర్ణాటక) జట్టు రూ.10 వేలు, శకునాల జట్టు రూ.6 వేలు, కాల్వబుగ్గ హంటర్స్ జట్టు రూ.5 వేలు దక్కించుకున్నాయి. ఈ పోటీలకు చాకలి యాగంటయ్య, మంద విజయ్, మంద నరేష్, చాకలి స్వాములు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

ఈరోజు

నేడు వీహెచ్‌పీ నిరసన

కర్నూలు కల్చరల్: రాయచోటిలో ఈ నెల 4వ తేదీన జరిగిన వీరభద్ర స్వామి ఉత్సవ ఊరేగింపుపై దాడికి నిరసనగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టినట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి పేర్కొన్నారు. స్థానిక వినాయక ఘాట్ నుంచి కలెక్టరేట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ ఉంటుందని తెలిపారు. హిందు బంధువులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, వీహెచ్‌పీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'సంపూర్ణ భగవద్గీత' పారాయణం

కర్నూలు కల్చరల్: స్వామి విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఏకాదశి పురస్కరించుకొని సోమవారం «సంపూర్ణ భగవద్గీత» పారాయణం నిర్వహించనున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఉదయం 9.30 గంటలకు పారాయణ యజ్ఞం జరుగుతుందన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, సభ్యులు, భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలపై అర్జీలను స్థానిక కార్యాలయంలో అందజేయవచ్చన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరు కావాలని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

మహాధర్నాకు పిలుపు

కర్నూలు(సెంట్రల్): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ మార్చి 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇళ్లు లేని వారికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి రూ.5 లక్షలతో ఇళ్లు కట్టించి ఇస్తానని చెప్పారని, అయితే బడ్జెట్‌లో గృహ నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. గృహ నిర్మాణ పథకానికి నిధులు కేటాయించాలని కోరుతూ మహాధర్నాకు దిగుతున్నట్లు చెప్పారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు తెలిపాలని కోరారు.

బాలోత్సవ కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): కర్నూలు బాలోత్సవం నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా జి.పుల్లయ్య, ధనుజయలను ఎన్నుకున్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మాంటిస్సోరి పాఠశాల అధినేత రాజశేఖర్, అధ్యక్షుడిగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, గౌరవ సలహారుడిగా క్లస్టర్ వర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్‌బాను, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ ఎన్నికయ్యారు. వీరితోపాటు గౌరవ సలహాదారులుగా లలిత కళా సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ఉపాధ్యక్షులుగా బసవరాజు, రమాదేవి, రమణారెడ్డి, ఖాజా హుస్సేన్, అవుల చక్రపాణి యాదవ్, కార్యదర్శులుగా ఎస్ఎం జయరాజు, నవీన్‌పాటి, రాజు, సాయి ఉదయ్, సుధీర్‌రాజు, మల్లేశ్వరి, ప్రచార కార్యదర్శులుగా ఎల్లగువేరా, డి.చంద్రమోహన్, కోశాధికారిగా జే.రంగస్వామి, కమిటీ సభ్యులుగా మరో 20 మంది ఎన్నికయ్యారు.

సన్మానం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ మొయిన్ బజార్ పేట శ్రీ రామాలయం శతాబ్ది ఉత్సవాలు, కర్నూలు నగరంలో వీహెచ్‌పీ స్థాపకుల్లో ఒకరైన మాళిగి నారాయణాచార్యులు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రామాలయంలో పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఉత్తరాధి మఠాధికారి రామ్మూర్తి ఆచార్యులు, ఆధ్యాత్మికవేత్త ప్రసాద్ భట్, వాసవీ విద్యా సంస్థల అధినేత సోమిశెట్టి వెంకట్రామయ్య, ప్రముఖ వైద్యులు నగేష్, వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు దేశినేని దేవనాయుడు, విశ్రాంత తహసీల్దార్ క్రిష్టన్న, రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్, విజ్ఞాన పీఠం కార్యదర్శి గురుమూర్తి తదితరులను మాళిగ కుటుంబ సభ్యులు వ్యాసరాజ్, ప్రదీప్, రాఘవేంద్ర ప్రసాద్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయండి



కాటసాని దంపతులను సత్కరిస్తున్న నేతలు

కల్లూరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గం, మండలాల విభాగాల్లో పదవులు పొందిన వారంతా బాధ్యతయుతంగా, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలిగా నియమితులైన కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి ఆదివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారికి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో పదవులు పొందిన వారంతా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. నాయకులు హనుమంతురెడ్డి, రమణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గంగులు తదితరులు పాల్గొన్నారు.



గెలుపు సంబరాలు

రాజ్‌విహార్ సర్కిల్‌లో సంబరాలు చేసుకుంటున్న యువకులు

కర్నూలు అగ్రికల్చర్: ఐసీసీ చాంపియన్‌షిప్ ట్రోఫీని భారత జట్టు గెలుపొందడంతో కర్నూలులో సంబరాలు వెల్లువెత్తాయి. దుబాయ్‌లో జరిగిన చాంపియన్‌షిప్ ఫైనల్‌లో భారత జట్టు నాలుగు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. దీంతో సంబరాలు మిన్నంటాయి. కర్నూలులో వందలాది మంది యువకులు జాతీయ పతాకాలు చేతబట్టి బైక్ ర్యాలీలు నిర్వహించారు. రాజ్‌విహార్ సెంటర్‌లో యువత బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ

కర్నూలు(రూరల్): కర్నూలు మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో ఆదివారం ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన, పరిపాలన అధికారి జి.వి.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. బి.తాండ్రపాడులో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ కురువ మద్దిలేటి ఆర్‌డబ్ల్యూఎస్ మండల అధికారి రంగస్వామి దృష్టికి తెచ్చారు. ఇ.తాండ్రపాడులో 11 కేవీ వైర్లు ఇందిరమ్మ కాలనీ మిద్దెల మీదుగా వెళ్లడం వల్ల కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, సర్పంచ్ బాలపీర సమస్యను మండల విద్యుత్ అధికారి దృష్టికి తెచ్చారు. రేమటలో విద్యుత్ స్తంభాలు ఇళ్లకు దగ్గరగా ఉన్నాయని ఆ ఎంపీటీసీ లేవనెత్తారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎంపీపీ సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. వివిధ శాఖల మండల అధికారులు, వైస్ ఎంపీపీ నెహమ్మా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొనారు.

పుష్పరథంపై చెన్న సోమేశ్వరుడు



పోలకల్‌లో పుష్పరథంపై చెన్నసోమేశ్వరుడిని ఊరేగిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో చెన్నసోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటి రోజు శనివారం అర్ధరాత్రి పుష్పరథోత్సవం వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున గంగాదేవి, పార్వతీదేవి సమేత చెన్నసోమేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్పరథంపై మేళతాలాలతో ప్రధాన వీధిలో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.